క్లుప్తంగా

నేడు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

త్రిపురారం : నేడు(ఆదివారం) మండల కేంద్రంలోని కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలో బాబుసాయి పేట రోడ్డులో కృషి విజ్ఞాన కేంద్రం సమీపంలో ఉన్న టీఎస్ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్ పొందుటకు అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బూరుగు నిర్మల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి 12గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 2గంటల నుంచి 4 గంటల వరకు అర్హత పరీక్ష ఉంటుందన్నారు. పరీక్ష సమయం కంటే అర గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మాడుగులపల్లి : పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రొండి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. మండలంలోని పంచాయతీ కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, సర్పంచ్‌లు, కార్యదర్శులను అడిగితే నిధులు లేవని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆరోపించారు. అరకొర వేతనాలు సకాలంలో అందక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు జానయ్య, నాగయ్య, ప్రవీణ్, వెంకటయ్య పాల్గొన్నారు.

మద్దతు ధర రూ. 2500 చెల్లించాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ప్రభుత్వం వరి ధాన్యానికి మద్దతు ధర రూ. 2500 చెల్లించి సకాలంలో రైతుల వద్దనున్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఎం సీనియర్ నాయకుడు వేములకొండ పుల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మండలంలోని రాజవరం గ్రామంలో ఐకేపీ ధాన్యం సెంటర్ వద్దకు వెళ్లి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు వచ్చే అవకాశం ఉండటంతో అధికారులు ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎలకాని చిన కనకయ్య, అంజయ్య, లక్ష్మమ్మ, పద్మ, ప్రియమణి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు సన్మానం

డిండి : మండల పరిధిలోని తవక్లాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న జరినా అనే విద్యావలంటీర్‌కు అదే గ్రామ మాజీ సర్పంచ్ పొన్నగంటి అలివేలు కృష్ణయ్య జీతం రూపంలో రూ. 60 వేలు అందించి తన ఔన్నత్యాన్ని చాటుకున్నారు. దీంతో అలివేలు కృష్ణయ్యను శనివారం ఉపాధ్యాయులు, గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సామ్యానాయక్ ప్రధానోపధ్యాయుడు రాజేందర్‌రెడ్డి, ఎస్ఎంసీ చెర్మన్ రమేష్, జగన్‌మోహన్‌రెడ్డి, ప్రవీణ్, సోమిరెడ్డి, రజినీకాంత్, వెంకటేష్, రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

దేవరకొండ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం దేవరకొండ పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో నిర్వహించిన దేవరకొండ మండల సీపీఐ కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రచారజాత ప్రారంభానికి సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, ఉజ్జిని రత్నాకర్‌రావు, ఉజ్జిని యాదగిరిరావు, నెల్లికంటి సత్యంలు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు పార్లపల్లి కేశవరెడ్డి, రామస్వామి, వెంకట్రాములు, ఆంజనేయులు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



శిల్పకు ల్యాప్‌టాప్ అందజేస్తున్న వార్డెన్ రుణాదేవి

దేవరకొండ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లో అంబేడ్కర్ జీవిత చరిత్ర గురించి షెడ్యూల్డ్ కులాలు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో వ్యారచన పోటీలు నిర్వహించారు.ఈ వ్యాసరచన పోటీల్లో దేవరకొండ సాంఘీక సంక్షేమ వసతి గృహం విద్యార్థిని శిల్ప రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. షెడ్యూల్డ్ కులాలు అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, కమిషనర్ యోగితారాణలు మీదుగా రూ.50వేలు విలువైన ల్యాప్‌టాప్‌ను అందజేసినట్లు వార్డెన్ రుణాదేవి తెలిపారు. శనివారం వార్డెన్ శిల్పకు ల్యాప్‌టాప్‌ను అందజేసి అభినందించారు.

ధాన్యం.. దైన్యం!

- మిర్యాలగూడ మార్కెట్‌కు పోటెత్తుతున్న వడ్లు
- 20 రోజుల నుంచి తెస్తున్న రైతాంగం
- 70 వేల క్వింటాళ్ల మేర ధాన్యం నిల్వ
- నేటికీ ప్రారంభంకాని కొనుగోళ్లు
- అన్నదాతకు తప్పని ఎదురుచూపులు



మిర్యాలగూడ మార్కెట్ యార్డులో రైతులు తీసుకొచ్చిన ధాన్యం

మిర్యాలగూడ: ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులకు అష్టకష్టాలు తప్పడం లేదు. వరికోతలు మొదలుకావడంతో దాదాపు 20 రోజులుగా మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్‌కు రైతులు పెద్ద ఎత్తున ధాన్యం తెచ్చి రాశులుగా పోసుకున్నారు. మార్కెట్‌లో శనివారం నాటికి సుమారు 70వేల క్వింటాళ్ల ధాన్యం నిల్వ ఉంది. ఈ మార్కెట్‌లో ఆలగడప పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాల్సి ఉంది. నేటికీ ఇక్కడ కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. అకాల వర్షాలు సంభవిస్తే ధాన్యంపై కప్పేందుకు కనీసం టార్పాలిన్లు కూడా లేకపోవడంతో తమ ధాన్యం తడిసి ముద్దయి తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

బస్తాలు, ట్యాబ్‌లు అందకపోవడంతో..

మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్‌కు సమీప గ్రామాల రైతులు భారీగా ధాన్యం తెస్తున్నారు. ప్రభుత్వం నిబంధనల మేరకు తేమ శాతం కలిగి ఉండేందుకు మార్కెట్‌లో ధాన్యం ఆరబోసి ఉంచారు. వ్యవసాయ అధికారులు మాయిశ్చర్ నమోదు చేసుకున్నారు. పలువురు రైతులకు 15శాతం నుంచి 17శాతం వరకు నమోదైంది. కానీ, ఇప్పటి వరకు బస్తాలు అందుబాటులో లేవు. రైతుల వివరాలు నమోదు చేసుకునేందుకు అవసరమైన ట్యాబ్‌లు సైతం సిబ్బందికి చేరలేదు. దీంతో రోజుల తరబడి రైతులు మార్కెట్‌లో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది.

మిల్లులకు కేటాయింపుపై స్పష్టత కరువు..

ప్రాథమిక సహకార సంఘాలు, ఐకేపీ కేంద్రాల నిర్వాహకులు.. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తారు. కాగా మిల్లుల నుంచి బియ్యం పాత బకాయిలు ఇంకా క్లియర్ కాలేదు. పెద్ద సంఖ్యలో మిల్లుల నుంచి సివిల్ సప్లయ్ బియ్యం రికవరీ చేయాల్సి ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వం కొన్ని మిల్లులను బ్లాక్ లిస్టులో ఉంచింది. ఈ యాసంగి సీజన్‌కు సంబంధించి ఏ మిల్లుకు ఎంత కోటా అనేది ఇంకా నిర్ణయించనట్టుగా తెలుస్తోంది. ఈ క్రమంలో రైతులు రోజుల తరబడి మార్కెట్‌లోనే నిరీక్షించాల్సి వస్తుంది. ఇదిలా ఉంటే ట్యాబ్‌లో రైతుల వివరాలు నమోదు చేసే సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయాల్సి ఉన్నట్లు సమాచారం. ముందస్తు ప్రణాళిక లేని అధికారుల తీరుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

20 రోజులుగా నిరీక్షణ



20 రోజుల క్రితం కోత కోసి ధాన్యాన్ని ఆరబెట్టేందుకు మార్కెట్‌కు తీసుకొచ్చాను. ఈనెల 11న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన అధికారులు ఒక్క గింజ కూడా కొనలేదు. అడిగితే బస్తాలు లేవు, ట్యాబ్‌లు రాలేదు అంటున్నారు. వర్షం వస్తుందేమోనని భయంగా ఉంది.

– గగులోతు లింగానాయక్, రైతు, జాలుబాయితండా

300 బస్తాల ధాన్యం తెచ్చాను



నేను 15 రోజుల క్రితం 300 బస్తాల ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకొచ్చాను. 15శాతం మాయిశ్చర్ ఉన్నప్పటికీ ధాన్యం కొనడం లేదు. బస్తాలు, ట్యాబ్‌లు లేవని సిబ్బంది సమాధానం చెబున్నారు. వర్షం వస్తే ధాన్యం తడిసేలా ఉంది.

– రమావత్ పాండు, రైతు, ఐలాపురం

రెండు రోజుల్లో కొనుగోళ్లు ప్రారంభిస్తాం

నిబంధనల మేరకు తేమ 17శాతం ఉండేలా ధాన్యం ఆరబెట్టాలి. కొనుగోళ్లకు అవసరమైన బస్తాలు, కాంటాలు సిద్ధం చేశాం. మిల్లులకు అలాట్‌మెంట్ సమాచారం అందింది. రైతుల వివరాల నమోదుకు సిబ్బందికి నల్లగొండలో శిక్షణ జరుగుతుంది. సోమవారం నుంచి కొనుగోలు ప్రారంభిస్తాం.

– లచ్చయ్య, పీఏసీఎస్, సీఈఓ, మిర్యాలగూడ

దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ శకం మొదలు

- ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చింతపల్లి : దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ శకం మొదలైందని ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సాయి సుమంగళి గార్డెన్స్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గులాబీ జెండాకు తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. రైతు బంధు, రైతు బీమా పథకాలు యావత్ భారత్ దేశం మొత్తంలో కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే అమలవుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు అందించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో చీకట్లను పారదోలి 24గంటల నిరంతర విద్యుత్ అందిస్తుందన్నారు. పేదింటి ఆడ బిడ్డల పెళ్లిలకు షాదీముబారక్, కల్యాణ లక్ష్మి పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోనూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ మండల నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అంతకుముందు చింతపల్లి పెట్రోల్ బంక్ నుంచి సాయి సుమంగళి గార్డెన్స్ వరకు కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గిరిధర్, జెడ్పీటీసీ ప్రవీణ, ఉపాధ్యక్షుడు అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రావు, కిష్టారెడ్డి, రవి, మాస భాస్కర్, ఉజ్జిని విద్యాసాగర్‌రావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం



వేములపల్లిలో ఐకేపీ కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్

వేములపల్లి : రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ కేంద్రంలో రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని పరిశీలించి రైతులు ఎదుర్కొంటున్న సమ్యలను అడిగి తెలుసుకోని మాట్లాడారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేయకపోవడంతోపాటు రైతులకు అందించాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ రైతులను ఇబ్బందులపాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు అనిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, సైదులు, లింగయ్య, ఆదిరెడ్డి, కనకయ్య, వెంకన్న, రమేష్, మైసయ్య, సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

- మాజీ ఎమ్మెల్యే బాలునాయక్



సమావేశంలో మాట్లాడుతున్న బాలునాయక్

కొండమల్లేపల్లి : రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం కొండమల్లేపల్లిలోని కేఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ‘హాథ్ సే హాథ్ జోడో’ యాత్రను చింతపల్లి, డిండి మండలాల్లో విజయవంతంగా ముగించుకొని ఈనెల 21 నుంచి తొమ్మిది రోజుల పాటు మండలంలోని ప్రతి గ్రామంలో యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ సభలో రాహుల్‌గాంధీ ప్రకటించిన ప్రతి అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పీసీసీ మెంబర్లు డాక్టర్ దూదిపాల వేణుధర్‌రెడ్డి, జాల నర్సింహారెడ్డి, వడ్త్య రమేశ్ నాయక్, వైస్ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, కోఆప్షన్ మెంబర్ సిరాజ్‌ఖాన్, శ్రీధర్‌రెడ్డి, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు వెంకటమ్మ, యాదమ్మ, శంకర్‌గౌడ్, అందుగుల ముత్యాలు, సర్పంచులు గడ్డం శ్రీరాములు, రవినాయక్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

మిర్యాలగూడ టౌన్ : స్థానిక ఆర్టీసీ డీపోలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఆర్టీసీ ఉద్యోగ, సిబ్బందికి మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్ ప్రారంభించి మాట్లాడారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఆర్టీసీ ఉద్యోగ సిబ్బంది మజ్జిగను సద్వినియోగం చేసుకోవాల నారు. అదే విధంగా వాసవిక్లబ్ వారు మినరల్ చల్లటి నీటి, సత్యసాయి సేవా సమితి వారు కూడా ప్రయాణికులు కోసం చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎఫ్ యాదగిరి, అగ్నిమాపక కేంద్రం అధికారి కె. రాజు, ఆర్టీసీ స్టేషన్ మేనేజర్ బిక్షమమ్మ, ఉద్యోగులు శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, లక్ష్మయ్య, రామావతారం, కృష్ణయ్య, సెక్యూరిటీ అధికారి జానకిరాం రెడ్డి, ఫైర్ సిబ్బంది అయ్యన్న పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న డీఎం పాల్

అగ్నిప్రమాదాలపై అవగాహన ఉండాలి



మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి



హాలియా ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మిర్యాలగూడ టౌన్ : అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని మిర్యాలగూడ అగ్నిమాపక అధికారి కె. రాజు అన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాల నివారణకు పాటించాల్సిన పద్ధతులపై అధికారులు కె. రాజు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిలో వస్తువులను అల్మారాల్లో, సెల్ఫుల్లో సక్రమంగా ఉంచుకోవడంతో పాటు ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వంట గదుల్లో తప్పనిసరిగా సిలిండర్ పై భాగంలో గాలి, వెలుతురు ఉండే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్, అగ్నిమాపక సిబ్బంది ఫైర్ సిబ్బంది ఆర్ బిక్. బి. అయ్యన్న, సతీష్, నర్సింహారావు పాల్గొన్నారు.

హాలియా : అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి యుగందర్ ప్రసాద్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం హాలియా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు అగ్ని ప్రమాదాలు సంబవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎక్కడైన అగ్ని ప్రమాదాలు సంబవించినప్పుడు వెంటనే 101కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది శంకర్, నాగుల్ మీరా, జలందర్, కృష్ణయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



హాలియాలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ పెద్దులు

హాలియా : తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొడ్డున ఏర్పాటు చేసిన సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు ఆధ్వర్యంలో శనివారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ నూతన సచివాలయ భవనానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టి సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందారన్నాడీ్క కార్యక్రమంలో హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ లింగయ్య, తిరుమలగిరి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు నాగయ్య, హాలియా టౌన్ అధ్యక్షుడు ముత్యాలు, మాజీ ఎంపీపీ దూళిపాల రామచంద్రయ్య, నాయకులు వెంకటేశ్వర్లు, మార్కెట్ డైరెక్టర్ సురభి రాంబాబు, సైదులు, తిరుమల్, ఎంపీటీసీ బాసిరెడ్డి భార్గవిశ్రీనివాస్‌రెడ్డి, పెద్దిరాజు, పట్టణ యూత్ అధ్యక్షుడు సైదాచారి, మారయ్య, రాకేష్, రావులపాటి లింగయ్య, చంద్రశేఖర్, వెంకటయ్య, సత్తయ్య, మహేష్, వెంకటయ్య, రాములు, వెంకటేశ్వర్లు, ఏసు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే పేదలకు సంక్షేమ ఫలాలు



ఉట్లపల్లి గ్రామంలో జోడో యాత్ర నిర్వహిస్తున్న బీఎల్ఆర్

మిర్యాలగూడ : కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రంలోని పేదలకు సంక్షేమ ఫలాలు అందాయని కాంగ్రెస్ పార్టీ మిర్యాలగూడ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీఎల్ఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీఎల్ఆర్ చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర శనివారం మిర్యాలగూడ మండలంలోని ఉట్లపల్లి, ఎర్రావులపాడు, కాల్వపల్లితండా, కాల్వపల్లి గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గంలో తాను చేపట్టిన కార్యక్రమాలను అధికార పార్టీ నాయకులు కాపీ కొడుతున్నారని ఎద్దేవా చేశారు. గ్రామాల్లో ప్రభుత్వం తూ తూ మంత్రంగా పనులు చేపడుతున్నారని ఆరోపించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో ఇచ్చిన మాటకు కట్టుబడి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల మనస్సులను చూరగొన్నారన్నారు. గత ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన రైతు రుణమాఫీ, రైతులకు సబ్సిడీలు, కొత్త రేషన్‌కార్డులు, పెన్షన్లు, డబుల్‌బెడ్‌రూమ్‌లు వంటి అనే హామీలను అమలు చేయలేదన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లౌకిక వాదాన్ని కాపాడేందుకు సీఎం కేసీఆర్ కృషి



మాట్లాడుతున్న శాసనమండలి చైర్మన్ గుత్తా

మిర్యాలగూడ : దేశంలో లౌకిక వాదాన్ని కాపాడేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక చిన్న మసీదులో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందించే సహకారం కాకుండా తాను వ్యక్తిగతంగా ప్రతి ఒక్క ముస్లింకు రంజాన్ తోఫా అందిస్తానని ఎమ్మెల్యే భాస్కర్‌రావు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ విజయసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ భార్గవ్, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర విష్ణు పాల్గొన్నారు.

బాలికల హక్కులను పరిరక్షించాలి



హాలియాలో మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

హాలియా : బాల హక్కులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ గంధం పద్మావతి, కౌన్సిలర్ ప్రసాద్ నాయక్ అన్నారు. అనుముల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అనుముల తండాలో తల్లులు, కిశోర బాలికలకు నిర్వహించిన స్వరక్షణే కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు షీటీంలు 1098, 100, 181 ఉచిత కాల్స్ సర్వీసులు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆపద సమయంలో ప్రతి ఆడబిడ్డ హెల్ప్ లైన్ నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవీ, మోతీలాల్, అంగన్‌వాడీ టీచర్స్ కవిత, హనీమి, సుజాత, పద్మమ్మ, మాజీ ఎంపీటీసీ తులస్య, కిశోర బాలికలు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బి. అన్నారం సెక్టార్‌లో గల దుర్గానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ సుపర్‌వైజర్ సుశీల ఆధ్వర్యంలో ఎస్‌కె అయాన్ చిన్నారికి అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ కార్యక్రమాలను నేర్పించడం జరుగుతుందని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రేణుక, ఆశా వర్కర్ సుజాత, అంగన్‌వాడీ టీచరు ఎస్‌కె ఎస్‌కె నసీమా సుల్తానా, చిన్నారుల తల్లులు ఎస్‌కె రజియా, బంగారమ్మ, శోభ, సౌజన్య, రేష్మా, యామినిలతో పాటు పాల్గొన్నారు.

కూలి గిట్టుబాటు అయ్యేలా పనులు కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ బాలకృష్ణ

వేములపల్లి : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద కూలీలకు గరిష్ట దినసరి కూలి రేటు గిట్టుబాటు అయ్యేలా సిబ్బంది పనులు కల్పించాలని క్లస్టర్ ఏపీడీ బాలకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని బుగ్గబావిగూడెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధి కూలీల దినసరి కూలి రూ.257 నుంచి రూ.272కు పెంచిందన్నారు. పని ప్రదేశంలో కొలతల ప్రకారం పని చేసి గరిష్ట వేతనం పొందాలని ఆయన సూచించారు. వేసవికాలం దృష్ట్యా ఎండలు అధికమవుతున్నందున ఉపాధి కూలీలు ఉదయం 7 గంటలకే హాజరై పనులు చేసేలా గ్రూపు మేట్లు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగలక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సబితా, ఎఫ్ఏ తులసీ, శ్రీను, ఏడుకొండలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్‌విందు

నిడమనూరు : మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అంకతి సత్యం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మట్టారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సతీష్, యాదగిరి, పాల్గొన్నారు.

సత్యనారాయణ చారి మృతి తీరని లోటు

మిర్యాలగూడ టౌన్ : నల్లగొండ జిల్లా విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్షుడు బోగోజు సత్యనారాయణచారి మృతి విశ్వబ్రాహ్మణ సంఘానికి తీరని లోటని సంఘం మండల అధ్యక్షుడు శిరసనగండ్ల ఈశ్వరాచారి అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్ఎస్పీ క్యాంపులో గల అమరవీరుల స్థూపం వద్ద బోగోజు సత్యనారాయణ చారికి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చూపిన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి తాడోజు శ్రీనివాసచారి, మండల సలహాదారులు తునికిపాటి ఏడుకొండల్‌చారి, కూరెళ్ల మట్టయ్యాచారి, మాజీ కార్పెంటర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి చెన్నూరి నర్సింహ్మచారి, బసవోజు బిష్మాచారి, పాలకి లక్ష్మినారాయణచారి తదితరులున్నారు.

ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయకపోవడం అన్యాయం



ఎంపీడీఓ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

మిర్యాలగూడ : ప్రభుత్వం విధించిన నాలుగేళ్ల ప్రొబేషన్ కాలం ముగిసినప్పటికీ ఇప్పటివరకు తమను రెగ్యులరైజ్ చేయకపోవడం అన్యాయమని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల దామరచర్ల మండల అధ్యక్షుడు నరేష్, ఉపాధ్యక్షుడు రమేశ్‌లు అన్నారు. శనివారం ఈమేరకు దామరచర్ల ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఎంపీఓ మోసిన్‌లకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమను రెగ్యులరైజ్ చేయడంతోపాటు తమ న్యాయమైన హక్కులను నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోల సాయికుమార్, మహేష్, కృష్ణ, నాగరాజు, నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగులపల్లి : నాలుగేళ్ల ప్రొబేషనరీ పూర్తయినందున తమను రెగ్యులర్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, ఎంపీఓ రవిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ నెల 28లోగా ప్రభుత్వం తమను రెగ్యులర్ కార్యదర్శులుగా గుర్తించకపోతే సమ్మెకు వెళ్లనున్నట్లు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండలాధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు షేక్ ఆసిఫ్, సంతోష్, నసీర్, కార్తీక్, షకీరా, కావ్య, కోటిలింగం పాల్గొన్నారు.


జార్జ్ రవికి దళితరత్న అవార్డు



దళిత రత్న అవార్డు అందుకుంటున్న రవి

త్రిపురారం : మండల కేంద్రానికి చెందిన మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరం జార్జ్ రవి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఇచ్చే దళిత రత్న అవార్డుకు ఎంపికయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆ సంఘం సభ్యులు జార్జ్ రవికి ఆ అవార్డులను అందజేశారు. దళిత రత్న అవార్డు ఎంపికకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. దళితుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తానన్నారు.

వీరేందర్‌కు అంబేడ్కర్ అవార్డు



అంబేడ్కర్ అవార్డు అందుకుంటున్న వీరేందర్

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మాలమహానాడు సంఘం అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న ఆ సంఘం మండల అధ్యక్షుడు జంగాల వీరేందర్‌కు అంబేడ్కర్ అవార్డు లభించింది. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య ఈ అవార్డును అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ ఉత్సవాల కమిటీ వర్కింగ్ చైర్మన్ జంగా శ్రీనివాస్, మేడి పాపయ్య, మధుబాబు ఉన్నారు. సంఘం బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు.